క్లుప్తంగా

వసంత కాలనీలో వసతుల కల్పనకు కృషి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ఇబ్రహీంపట్నం ఖిల్లా రోడ్డులో ఉన్న వసంత కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ సూచనల మేరకు వసంత కాలనీలో సోమవారం కమిషనర్ పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. డ్రెయినేజీలు, వీధి దీపాలు, తాగునీరు తదితర సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే అంచనాలు తయారు చేయించి మౌలిక వసతులు కల్పిస్తామని కమిషనర్ ప్రజలకు హామీ ఇచ్చారు.

రిటైర్డ్ డీసీఓ బైరామ్మూర్తి మృతి



బైరామ్మూర్తి (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఉమ్మడి కృష్ణా రిటైర్డ్ జిల్లా కో–ఆపరేటివ్ అధికారి నెల్లం బైరామ్మూర్తి (65)అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురం సమీపంలో తోపుకూరు ఈయన స్వగ్రామం. ఉద్యోగ రీత్యా 2000వ సంవత్సరం సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా విజయవాడకు బదిలీపై వచ్చారు. అనంతరం డీసీఓగా బాధ్యతలు నిర్వహించారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని 2019లో పదవీ విరమణ పొందారు. ఈ మధ్య అనారోగ్యానికి గురై హైదరాబాద్ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఉద్యోగులు, బంధువులు నివాళులర్పించి అంత్యక్రియలకు విజయవాడ నుంచి స్వగ్రామం తోపుకూరుకు మృతదేహాన్ని తరలించారు.

కరాటే విజేతలకు అభినందన



తిరువూరు: గుంటూరు జిల్లా మంగళగిరిలో షోటో రై జపాన్ సంస్థ ఆదివారం నిర్వహించిన 8వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తిరువూరుకు చెందిన హర్షా కరాటే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. సీనియర్స్ బాలికల విభాగంలో యోషిత, జూనియర్స్ బాలుర విభాగంలో రిషిక్ రామ్ ప్రథమ స్థానాలు సాధించినట్లు కోచ్ నాగేశ్వరరావు తెలిపారు. జూనియర్స్ కుమిటీ విభాగంలో హర్షిత్, జూనియర్స్ కట్టా బాలికల విభాగంలో సంహిత, రాజేశ్వరి, చైతన్య విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. విజేతలను తిరువూరు పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

బోర్డర్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి

జి.కొండూరు: తెలంగాణా రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల జరుగుతున్న క్రమంలో ఆ రాష్ట్రానికి బోర్డర్లో ఉన్న మైలవరం పోలీసు సర్కిల్ పరిధిలోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సీఐ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండల పరిధి గంగినేని గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత ప్రాంతాలలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తెలంగాణా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, డబ్బు సరఫరా చేయడం, గొడవలకు వెళ్లడం వంటి చర్యలకు పాల్పడవద్దని గ్రామస్తులకు సూచించారు. జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం ఎస్ఐలు ధర్మరాజు, హరిప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



తేజశ్విని

ఏ.కొండూరు: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం యూటీఎఫ్ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి బీసీహెచ్‌వీ. సూర్యనారాయణ తెలిపారు. యూటీఎఫ్ మండల అధ్యక్షురాలుగా వి.తేజశ్విని, ప్రధాన కార్యదర్శిగా జి.ఇస్సాక్, కోశాధికారిగా ఎస్.లక్ష్మీనారాయణ, ఆడిట్ కన్వీనర్‌గా బి. నాగేంద్రరావు, జిల్లా కౌన్సిలర్లుగా బి.సూర్య, కేఏ మంగమ్మ, పీ లీల, బి.విశ్వభారతి, కార్యదర్శులుగా బీవీ కృష్ణారెడ్డి, ఎం.సామ్రాజ్యం, ఏ రవీంద్రబాబు, జి.రామయ్య, బి. జెస్సీ రాణి, ఎల్ చంటిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

అక్కినేని మార్గదర్శకం

విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నటజీవితం భావి నటులకు మార్గదర్శకమని సీనియర్ గాయకుడు చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు ముగింపు వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని స్వయం కృషి, పట్టుదలతో తెలుగు సినిమా గర్వించే స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ సేవలు చేరువ చేసేందుకే సచివాలయాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



కొర్లమండలో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కొర్లమండ(విస్సన్నపేట): ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని కొర్లమండ గ్రామంలో రూ.57.50 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవనాలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, పీఆర్ డీఈ చక్రవర్తి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, సర్పంచ్ దేవరం విజయకుమారి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు దేవరం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు వసుందర, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనుమోలు శివబాజీ, జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, నాయకులు లక్ష్మణరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

‘స్పందన’ అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



నూజివీడులో అర్జీదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: ‘స్పందన’ అర్జీల పరిష్కారంలో సంబంధిత అధికారులు అలసత్వం వహించకుండా గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. నూజివీడులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి వివిధ సమస్యలపై సబ్‌కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. అర్జీల పరిష్కారం వీలు కాకపోతే సంబంధిత కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. అంతేగాని కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భాస్కరరెడ్డి, సీడీపీఓ ఎస్‌వై నూరాణి, ఏడీఏ జీ విద్యాసాగర్, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఉద్యాన అధికారి రాజులపాటి హేమ, ఆర్‌అండ్‌బీ ఏఈ అశోక్ పాల్గొన్నారు.

గంపలగూడెంలో మూడు అర్జీలు

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మూడు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పైతాన్ ప్రోగ్రామింగ్‌కు ప్రాధాన్యం



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీలో పైథాన్ ప్రోగ్రామింగ్ ఆవశ్యకత ఎంతో ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం బీటెక్ విద్యార్థులకు డేటా సైన్స్ యూజింగ్ పైతాన్‌పై వారం రోజులు నిర్వహించే వర్క్‌షాపును సోమవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధునిక ప్రపంచంలో పెరుగుతున్న టెక్నాలజీలో డేటా సైన్స్ యూజింగ్ పైతాన్ ఆవశ్యకత పెరిగిందన్నారు. హైదరాబాద్‌కు చెందిన బ్రెయిన్ ఓ విజన్ సాఫ్ట్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ డీ వీరయ్య, ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఓ రమాదేవి, ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి ఎస్.జయప్రద, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ డేటా సైన్స్ యూజింగ్ పైతాన్ ఆవశ్యకత ప్రాముఖ్యత, ప్రస్తుత టెక్నాలజీలో పైతాన్ ప్రోగ్రామింగ్ సాంకేతికతను వివరించారు. రిసోర్స్‌పర్సన్స్‌గా ట్రైనర్ అండ్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ వీఎస్ పవన్, టెక్నికల్ హెడ్ బి.విజయకుమార్, సీనియర్ డేటా సైన్స్ ఇంజినీర్ యశస్వి సురభి ప్రసంగించారు. సొసైటీలో ఉన్న ప్రాబ్లమ్స్‌ని సాల్వ్ చేయడంలో వెబ్, డెస్క్‌టాప్ అప్లికేషన్స్ అభివృద్ధిలో డేటా సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు.

రైల్వే స్టేషన్‌లో సదుపాయాలు కల్పించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వందేళ్ల చరిత్ర కలిగిన కొండపల్లి రైల్వే స్టేషన్‌లో సదుపాయాలు కల్పించాలని స్టేషన్ అధికారులకు సోమవారం ప్రయాణికులు వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నంకు చెందిన కొనకాల ఆనంద్, నరసింహారావు మరికొంతమంది గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లేందుకు ఉదయం రైల్వే స్టేషన్‌కు వచ్చారు. వారిలో కొందరు దివ్యాంగులు, వృద్ధులు ఉండడంతో స్టేషన్ ప్లాట్‌ఫారాలకు చేరుకునేందుకు ఫ్లైఓవర్ వంతెన మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు స్టేషన్ టాయిలెట్స్‌లో నీరు, తాగునీరు సదుపాయం కూడా లేదని గుర్తించారు. సదుపాయాలు కల్పించి వృద్ధులు, దివ్యాంగులకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

నూజివీడు: ముక్కొల్లుపాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు, గొల్లపల్లి, దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



దివ్యాంగుడి ఆరోగ్య సమస్యను తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దయాల ఆశా

నూజివీడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి సకాలంలో వైద్య చికిత్సను అందించేందుకు వీలు కలిగిందని నూజివీడు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దయాల ఆశా అన్నారు. మండలంలోని మర్రిబంధంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ వడ్డాది లక్ష్మీ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సుగర్, బీపీ, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్నట్లుగా చాలామందికి ఇప్పటివరకు తెలియదన్నారు. ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పరీక్షలు చేసిన అనంతరం అవన్నీ తెలిశాయన్నారు. సమస్యలను గర్తించిన అనంతరం వారికి సకాలంలో వైద్యచికిత్సను అందించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 536 మందిని పరీక్షించి మందులు అందజేశారు. మెరుగైన చికిత్స అవసరమైన 11మందిని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, ఈఓఆర్డీ సరస్వతి, వైఎస్సార్ సీపీ నాయకుడు వడ్డాది త్రినాథ్‌రావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ కస్తూరిబాయి



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

తిరువూరు: పట్టణంలో నెలకొన్న పలు ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన సోమవారం జరిగింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా కట్టలేరులో భూగర్భ జలాలు అడుగంటి రక్షిత తాగునీరు సరిపడా సరఫరా చేయలేకపోతున్నామని, వాటర్ ట్యాంకుల ద్వారా అవసరమైన వార్డులకు నీరు పంపుతున్నామని చైర్‌పర్సన్ తెలిపారు. కృష్ణా నదీ జలాలను తాగునీటి సరఫరాకు రప్పించే పైలట్‌ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని కౌన్సిలర్లు కోరారు. రూ.50 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పలు వార్డుల్లో రహదారుల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నగర పంచాయతీలో తాత్కాలిక ప్రాతిపదికన నియమితులైన కార్మికులకు పూర్తి వేతనం చెల్లించాలని 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ కోరారు. కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు (బీరువాలబాబు), మూడు దుర్గారావు, పరసా సత్యనారాయణ, షేక్ హుసేన్, నాళ్లా సురేంద్ర మాట్లాడారు.

పూర్తి వేతనం చెల్లించాలి

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీలో తాత్కాలిక ప్రాతిపదికపై పనిచేస్తున్న తమకు పూర్తిస్థాయి వేతనాలివ్వాలని పారిశుద్ధ్య కార్మికులు సోమవారం కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులు సెలవుపెట్టినపుడు వారి విధులను తాము నిర్వర్తిస్తున్నామని, తమకు నామమాత్రంగా మాత్రమే వేతనం చెల్లిస్తున్నందున జీవనం కష్టతరంగా మారిందని తాత్కాలిక కార్మికులు పేర్కొన్నారు. పనికి తగిన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు తమకు న్యాయం చేయాలని కమిషనర్‌ను కోరారు.

మద్యం పట్టివేత

ముసునూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి, మద్యం కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ముసునూరుకు చెందిన వీరంకి నాగరాజు, కంచర్ల ఏసుబాబు అక్రమంగా మద్యం నిల్వ ఉంచి, అమ్ముతున్నారనే సమాచారంతో వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో మొత్తం 12 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

విద్యుత్ రాగి వైర్ల చోరీలపై కేసు నమోదు

ముసునూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైరు, యాసిడ్ చోరీలపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. సూరేపల్లి, బాసవరప్పాడు గ్రామాలకు చెందిన యలమంచిలి శ్రీనివాసరావు, హెచ్చు కృష్ణకు చెందిన వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలోని విలువైన రాగివైరు, యాసిడ్ ఈ నెల 12వ తేదీన చోరీకి గురైనట్లు రమణక్కపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌కు ఫిర్యాదులు అందాయి. వీటిపై శాఖాపరమైన విచారణ, వాంగ్మూలం స్వీకరించిన అనంతరం ఏఈ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చెప్పారు.

సెంద్రియ ఉత్పత్తుల స్టాల్‌ను వినియోగించుకోండి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సేంద్రియ ఉత్పత్తుల స్టాల్

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ స్టాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌బీఎన్ఎఫ్ శిక్షకురాలు జీ విజయకుమారి పేర్కొన్నారు. జెడ్‌బీఎన్ఎఫ్ (జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్) ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సేంద్రియ పద్ధతిలో సాగుచేసి పండించిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా బియ్యం, బెల్లం, పసుపు, కూరగాయలు తదితర వాటిని అమ్ముతున్నారు. దీంతో ప్రజలకు నాణ్యమైన, పురుగుమందుల రహిత వస్తువులు లభ్యమవుతున్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిబ్బంది ఏ కృష్ణవేణి, ఆర్.నాగమల్లేశ్వరరావు, వై రమేష్, టీ దుర్గ, వీ స్వర్ణలత, పీ వెయ్యిగళ్ల పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ఏపీఎంపీఏ లక్ష్యం

మైలవరం: జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ తెలిపారు. మైలవరం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం అసోసియేషన్ మెంబర్‌షిప్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా నవరత్నాలు పథకం ప్రారంభించడం అభినందనీయమన్నారు. అదేవిధంగా నవరత్నాలలో పాత్రికేయులకు తగిన పథకాలు వర్తింపజేయాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రొఫెషనల్ ఎథిక్స్ ఉండాలన్నారు. నైతిక విలువలున్న జర్నలిస్టులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బి.విజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రమణ, చైతన్య, అనిల్‌కుమార్, మల్లెల శ్రీనివాస్, జీ నాగరాజు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లు ప్రారంభం

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో దాతల సహకారంతో నిర్మించిన సిమెంట్ రోడ్లను సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన గోగినేని భానుమతి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు గోగినేని విజయగోపాల్ రూ.12 లక్షలతో ప్రకాశం రోడ్డు సీసీ కల్వర్టు వద్ద నుంచి దళితవాడ రోడ్డు వరకు, మూడో వార్డు సభ్యురాలు పలగాని రాణి కుటుంబ సభ్యులు రూ.4 లక్షల వ్యయంతో దళితవాడ అప్రోచ్ రోడ్డు నుంచి కంచర్ల రామారావు ఇంటి వరకు సిమెంట్ రహదారులను నిర్మించారు. వీటిని సర్పంచ్ బొకినాల వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. అనంతరం గ్రామ పెద్దలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చల్లారి రేణుక ధనలక్ష్మి, తటకలూరి రామయ్య, మాజీ సర్పంచ్‌లు ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్మృతివనం పనుల పరిశీలన



స్మృతివనం పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. స్మృతి వనం పనుల కోసం వందలాది మంది కార్మికులు భారీ యంత్రాలతో నిరంతరం పనులను కొనసాగిస్తున్నారని చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతివనం నిర్మాణ డిజైన్ల ఆధారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచామని తెలిపారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. గ్రానైట్, ఫుట్ పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. పార్కింగ్ ఏరియా సిద్ధం చేస్తున్నామని, ఈ ప్రాంగణంలో అందమైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

మైలవరం: నవంబర్ 3న జరిగే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే సందర్భంగా జీ కొండూరు మండలంలో వివిధ పాఠశాలల్లో జరుగు సర్వేలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా పాల్గొనేందుకు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 40మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేసినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిమిత్తం జి.కొండూరు మండలం నందు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ వి.ఫణికుమార్, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నేస్వామి పాల్గొన్నారు.

పేరుకే శివారు గ్రామం.. అభివృద్ధిలో ముందంజ





పైడూరుపాడు ఎస్సీ కాలనీలో నిర్మించిన రోడ్లు

పైడూరుపాడు(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలంలో మారుమూల గ్రామమైన పైడూరుపాడు అభివృద్ధి పనుల్లో ముందడుగులో ఉంది. మౌలిక సదుపాయాలకు బహుదూరంగా ఉండే ఈ గ్రామం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పిమ్మట మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతను ఇచ్చింది. పలు అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టింది. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకోగా, సచివాలయ భవనం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం, రైతుభరోసా నిర్మాణం లాంటి పనులు జరుగుతున్నాయి. గ్రామంలో మూడు వేల జనాభాతో మైనర్ పంచాయతీ కావడంతో రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులను సమకూర్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గ్రామంలో ఇప్పటి వరకు కోటి రూపాయలను ప్రభుత్వం అభివృద్ధి పనులకు కేటాయించింది. ఎస్సీ ఏరియాలో రూ.28 లక్షలతో రెండు సిమెంటు రోడ్లు కమ్ డ్రెయిన్లు నిర్మించారు. అంతేగాకుండా రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం, రూ.28 లక్షలతో సచివాలయ భవన నిర్మాణం జరుగుతోంది. మరో రూ.18లక్షలతో వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మౌలిక సదుపాయల్లో మరొకటి గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్‌ను ప్రాథమికోన్నత పాఠశాలగా అభివృద్ధి చేశారు. ఈ విధంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాం



ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పనులు చేపట్టాం. గ్రామ ఎస్సీ కాలనీలో రోడ్లు సరిగా లేక వర్షం వస్తే ఇబ్బంది పడే ప్రజలు ప్రస్తుతం కాలికి మట్టి అంటకుండా మెయిన్ రోడ్డుకు వస్తున్నారు.

– వి.సీతారామయ్య, సర్పంచ్, పైడూరుపాడు

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్య సంరక్షణ

చాట్రాయి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పంటల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువుల ద్వారా పండించిన పంటలను తినడం వలన అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలైన కాయగూరలు, ఆకు కూరలు, బెల్లంను సిబ్బంది విక్రయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దుర్గా ప్రసాదు, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సంఘ ప్రధానకార్యదర్శిగా బొల్లినేని

తిరువూరు: ఏపీ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిరువూరు మండలం లక్ష్మీపురం పీఏసీఎస్ కార్యదర్శి బొల్లినేని రఘురాం ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేషన్ మహాజన సభ ఆదివారం విజయవాడలో జరిగింది. ఈ సభలో తనను ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రఘురాం తెలిపారు.

అడవినెక్కలంలో పోలీసుల తనిఖీలు

ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలంలో పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామునే పోలీసులు గ్రామంలోకి వెళ్లి ఇంటింటినీ విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ సోమవారం తెలిపారు. చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశమందిరంలో నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.